

## రోడ్డు బురదమయం..!

కోటపల్లి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకే రోడ్డు బురదమయంగా మారింది. కోటపల్లి మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో బురద రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. పడిపోయి గాయలపాలైన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి బురదను తొలగించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



## జీపీ భవనం అసంపూర్తి

భీమారం మండలంలోని కొత్తపల్లి జీపీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. పదేళ్ల క్రితం పనులు ప్రారంభించినా, ఇప్పటివరకు పూర్తిచేయకపోవడంతో తాత్కాలిక భవనంలో గ్రామ పంచాయతీని కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పనులు పూర్తిచేసి జీపీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. – భీమారం



## శిథిలావస్థలో వీగాం సబ్ సెంటర్

భీమిని మండలంలోని వీగాం సబ్ సెంటర్ పగుళ్లు తేలి శిథిలావస్థకు చేరింది. కిటికీలు, డోర్లు పగిలిపోయి అధ్వానంగా ఉన్నాయి. వైద్య సిబ్బంది భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అధికారులు స్పందించి సబ్ సెంటర్‌కు మరమ్మతు చేసి, అందుబాటులోకి తీసుకురావాలి. – భీమిని



## పేరుకుపోతున్న చెత్త

తాండూర్ మండల కేంద్రంలోని పంచాయతీరాజ్ కార్యాలయం ఎదురుగా, వైన్స్ సమీపంలో రోడ్డు పక్కనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు చర్యలు తీసుకొని నివాసాలకు సమీపంలో చెత్త వేయకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. – తాండూర్

## క్లుప్తంగా

### వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో గల వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ.. పలు కాలనీల్లో వీధి కుక్కల బెడద ఉందని పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. చిన్నారులను స్కూల్‌కు పంపించాలంటే వీధి కుక్కలతో భయం వేస్తుందని ప్రజల వినతుల మేరకు ఆపరేషన్ వీధి కుక్కలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పట్టణంలోని పలు వీధుల్లో ఐదు కుక్కలను పట్టుకొని మంచిర్యాల పట్టణంలో గల అనిమల్ కేర్ సెంటర్‌కు తరలించినట్లు తెలిపారు.

### అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



నినాదాలు చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

నెన్నెల: అటవీ హక్కుల చట్టం 2006ను సంపూర్ణంగా అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి డిమాండ్ చేశారు. జంగాల్‌పేటలోని కొత్తగూడంలో బుధవారం గిరిజనులతో కలిసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దళిత గిరిజనులు 50ఏళ్లుగా పోడు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారికి వెంటనే పట్టాలివ్వాలని కోరారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలుకయ్య, చంద్రయ్య, నాగేష్, మధునయ్య, సమ్మక్క, మధునక్క పాల్గొన్నారు.

### ఘనంగా సీతాలమ్మదేవి బోనాలు



బోనాలతో మహిళలు

రామకృష్ణాపూర్: రజక సంఘం ఆధ్వర్యంలో రజక కులదైవమైన మడేలయ్య–సీతాలమ్మ దేవి బోనాలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకొని బీజోన్ రాజీవ్‌చౌక్ మీదుగా ఏరియా ఆసుపత్రి వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు నడిగోట తిరుపతి, శంకర్, శ్రీనివాస్, సమ్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### గోరింటా సంబురాలు



భీమారం/పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం ఆర్య వైశ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో, భీమారం మండల కేంద్రంలో ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు సంబురాలు అంబరాన్నంటాయి. మహిళలకు లక్కీ గేమ్స్ నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

### మైలారంలో వనమహోత్సవం

నెన్నెల: మండలంలోని మైలారంలో బుధవారం నీల్వాయి రేంజ్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ నందిని మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో సతీష్, నాయకులు మల్లాగౌడ్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

# అర్బన్ పార్కు@ఆహ్లాదం

- సుమారు 492ఎకరాల్లో రూ.2కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు
- ఆకట్టుకుంటున్న కర్రతో చేసిన ఆకృతులు
- సీతాకోక చిలుకలకు ప్రత్యేకంగా గార్డెన్

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో సుమారు 492ఎకరాల అటవీ ప్రాంతంలో రూ.2కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ అర్బన్ పార్కు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఈ పార్కులో సుమారు 240రకాల చెట్లు ఉన్నాయి. అలాగే చెరువు, వాచ్ టవర్, సందర్శకులు ధ్యానం చేసుకునేందుకు పకోడాలు, ఓపెన్ జిమ్, సీతాకోక చిలుకల గార్డెన్, పిల్లలు సరదాగా ఆడుకునేందుకు వివిధ రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. పార్కు పక్కనే ప్రకృతి సిద్ధమైన అకిరా మియావాకి ప్లాంటేషన్ ఉంది. జనవరిలో చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో బర్డ్‌వాక్ సైతం నిర్వహించారు. ఈ బర్డ్‌వాక్‌కు ఇతర ప్రాంతాల నుంచి సుమారు 21మంది సందర్శకులు వచ్చి అనంతరం అర్బన్ పార్కులో సేద తీరారు. చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో నీటిలో, వృక్షాలపై ఉండే 120రకాల పక్షి జాతులు ఉన్నట్లు గుర్తించారు. అలా అర్బన్ పార్కులో 81రకాల సీతాకోక చిలుకలను గుర్తించారు. సీతాకోక చిలుకలకు ప్రత్యేకంగా గార్డెన్‌ను సైతం ఏర్పాటు చేశారు. పకోడా, ధ్యాన మందిరం, ముఖద్వారం ఇతర ఆకృతులను కర్రతో తయారు చేసిన మాదిరిగా రూపొందించారు. అవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



లింగంపల్లి సమీపంలోని అంబేడ్కర్ అర్బన్ పార్కు ముఖద్వారం

### సందర్శకులకు తెలియజేస్తున్నాం



అంబేడ్కర్ అర్బన్ పార్కుకి వచ్చిన సందర్శకుల కు, విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల గురించి అవగాహన కల్పిస్తున్నాం. అడవులు, వణ్యప్రాణుల సంరక్షణపై కూడా తెలియజేస్తున్నాం. ఎక్కడెక్కడో పాఠశాలల నుంచి వస్తున్న విద్యార్థులకు ప్రకృతి ఎలా ఉంటుందో తెలియజేస్తున్నాం.

– అంజయ్య, ఎఫ్ఎస్‌వో, కిష్టంపేట

### ప్రకృతి సిద్ధమైన పార్కు..



అంబేడ్కర్ అర్బన్ పార్కు ప్రకృతి సిద్ధమైన పార్కు. ఇక్కడ సుమారు 240కి పైగా పలు రకాల చెట్లు ఉన్నాయి. ధ్యానం చేసుకునేందుకు ధ్యాన మందిరం, చెరువు, పిల్లలు ఆడుకునేందుకు పార్కు, ఓపెన్ జిమ్, పకోడాలు ఏర్పాటు చేశాం. పార్కు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

– సర్వేశ్వర్, ఎఫ్‌డీవో



ధ్యాన మందిరం



సీతాకోక చిలుకల గార్డెన్



పకోడా

# జాబ్‌మేళాలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్

పాతమంచిర్యాల: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్ పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఉపాధి కల్పన శిక్షణ శాఖ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్తంగా బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరయ్యారు. 313మంది నిరుద్యోగులు హాజరు కాగా, 290మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 92మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కలెక్టర్ ఆఫర్ లెటర్లు అందించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ స్టేట్ హెడ్ సావిన్‌రెడ్డి, మేనేజర్ సాయికుమార్, 9 కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగ ఆఫర్ లెటర్ అందజేస్తున్న కుమార్‌దీపక్

## సమాచారం

### దరఖాస్తుల ఆహ్వానం

జన్నారం: జన్నారం మండలం ఐటీఐ కళాశాలలో కోపా, డ్రెస్‌మేకింగ్, వెల్డర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

**• కేజీబీవీ ఇంటర్‌లో చేరేందుకు..**

జన్నారం: మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి శ్రీవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎస్సెస్సీ మెమో, బోనాఫైడ్, రెండు ఫొటోలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

**• అతిథి అధ్యాపకుల కోసం...**

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్–1, కామర్స్–1, ఇంగ్లిష్–2, తెలుగు–1, ఫిజిక్స్–1 చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

**• ఉపకార వేతనాల కోసం...**

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో అభ్యసిస్తున్న అర్హులైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ విద్యార్థులు నూతన/రెన్యువల్ పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సీహెచ్. దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**• 25న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు**

మంచిర్యాలటౌన్: జిల్లాస్థాయి సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈ నెల 25న లక్సెట్టిపేట్‌లోని సీఈవో జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3, 4వ తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు ఉదయం 7గంటల్లోపు పీడీలు నాంపల్లి, రాజేశ్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు. అండర్–14, 16, 18, 20 బాలబాలికలు, మెన్, ఉమెన్ సీనియర్ పురుషులు, మహిళలు 30 ఏళ్లలోపు ఉన్నవారు పాల్గొనవచ్చని తెలిపారు.

**• కేజీబీవీలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్**

దండేపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ కింద దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్వో భాగ్యలక్ష్మి తెలిపారు. 6వ తరగతిలో 18, 7వ తరగతిలో 14, ఇంటర్మీడియెట్ ఎంఎల్‌టీలో 29సీట్లు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు.

**• 9న ఆదివాసీ దినోత్సవం**

దండేపల్లి: ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై దండేపల్లిలో బుధవారం నాయకులతో సమావేశం నిర్వహించారు.

**ధర్నా జయప్రదం చేయండి**

దండేపల్లి: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 25న మంచిర్యాల కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు మత్స్యకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడెంకి చందు తెలిపారు. కరపత్రాలను కన్నెపల్లిలో బుధవారం ఆవిష్కరించారు.

# ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సేవలను మహిళలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. మంచిర్యాల బస్‌స్టేషన్‌లో మహాలక్ష్మీ పథకంలో 200 కోట్ల మహిళ ప్రయాణికులు ప్రయాణించిన సందర్భంగా బుధవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ఐదుగురు మహిళ ప్రయాణికులను శాలువాలతో సన్మానించారు. మహిళా సాధికారిత అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థినులు గెలుపొందగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు శ్రీనివాస్, డీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అదనపు కలెక్టర్

## నూతన రేషన్ కార్డుల పంపిణీ

దండేపల్లి/లక్సెట్టిపేట/నస్పూర్: రేషన్‌కార్డులు లేని అర్హులందరికీ ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు అందిస్తుందని రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. నూతనంగా వచ్చిన రేషన్ కార్డులను బుధవారం అర్హులైన లబ్ధిదారులకు దండేపల్లిలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి, లక్సెట్టిపేట మండలం చందారంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, నస్పూర్ పట్టణ పరిధిలో తహసీల్దార్ సంతోష్ పంపిణీ చేశారు. ఆయా మండలాల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దండేపల్లి: రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న తిరుపతి

## విద్యాసంస్థల బంద్ సంపూర్ణం



జిల్లా కేంద్రంలో తరగతులు బహిష్కరిస్తూ...

బెల్లంపల్లి/కోటపల్లి/జన్నారం/దండేపల్లి/జైపూర్/చెన్నూర్/మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన విద్యాసంస్థల రాష్ట్ర బంద్ బుధవారం జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ప్రైవేట్ విద్యాసంస్థలను మూసి ఉంచగా, ప్రభుత్వ పాఠశాలలను వామపక్ష విద్యార్థి సంఘాల శ్రేణులు బంద్ చేయించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని నివారించాలని, విద్యాశాఖమంత్రిని నియమించి సమస్యలు పరిష్కరించాలని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు తీర్చాలనే డిమాండ్లతో నిర్వహించిన బంద్‌కు సానుకూల స్పందన లభించింది. ఆయా చోట్ల జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జన్నారంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజన్, దండేపల్లిలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు పిట్టల తిరుపతి, జైపూర్‌లో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల్లో గ్రంథాలయ పీరియడ్ సమర్థవంతంగా వినియోగించుకోవాలని డీఈవో యాదయ్య సూచించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల గ్రంథాలయాలను బలోపేతం చేయడంపై ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల అభ్యసన ఫలితాల సాధనలో కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**భవిత కేంద్రం పరిశీలన**

మంచిర్యాలఅర్బన్: స్థానిక భవిత కేంద్రాన్ని డీఈవో యాదయ్య బుధవారం పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో రైమ్స్ చెప్పించారు. గోడలపై చిత్రాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వేళ ఇబ్బందులు పడకుండా విద్యార్థులకు ప్లేట్లు అందించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి చౌదరి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ వేణుమాధవ్, ఐఈఆర్పీలు సృజన, శ్రీలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

## సంక్షిప్త వార్తలు

**ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు**

చెన్నూర్/జైపూర్: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ అన్నారు. బుధవారం ఆయన చెన్నూర్, జైపూర్ మండలాల్లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. యూరియా నిల్వలు, రికార్డులు పరిశీలించారు. కృత్రిమ కొరత సృష్టించినా, నిబంధనలు ఉల్లంఘించినా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఏ బానోత్ ప్రసాద్, జైపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు పోటీపడి చదవాలి**

దండేపల్లి: విద్యార్థులు పోటీపడి చదివితేనే మంచి ఫలితాలు సాధిస్తారని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. దండేపల్లి మండలం వెల్గనూర్, గుడిరేవు ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, కిట్లు బుధవారం అందించారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గూడెం–మేదరిపేట రింగ్‌రోడ్డు పనులు, వెల్గనూర్ సమీపంలో ఇంకా అసంపూర్తిగానే మిగిలిపోయిందని ఆరోపించాడు. అసంపూర్తి పనులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, పనులు వెంటనే పూర్తిచేయించాలని డిమాండ్ చేశారు.

**ఎస్టీపీపీ వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్‌కు అనారోగ్యం**

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆపరేషన్స్ విభాగాధిపతి వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్ అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్‌కు తరలించారు. బుధవారం కొంత అస్వస్థతకు గురికావడంతో సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించగా, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించి వైద్యం అందిస్తున్నారు.

**క్వార్టర్లకు మరమ్మతు చేయాలి**

శ్రీరాంపూర్: పై కప్పులు ఊరుస్తున్న క్వార్టర్లను వెంటనే మరమ్మతు చేయాలని హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కార్యదర్శి అశోక్ బుధవారం ఒక ప్రకటనలో యాజమాన్యంను డిమాండ్ చేశారు.

**గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్**

శ్రీరాంపూర్: ఆర్కే 7 గనిపై గైర్హాజరు కార్మికులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 102మందిని కౌన్సెలింగ్‌కు పిలువగా 63మంది హాజరయ్యారు. ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ఎడతెరిపి లేని వాన**

దండేపల్లి/జన్నారం/వేమనపల్లి/చెన్నూర్ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి, బుధవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

**సమస్యలు పరిష్కరించాలి**

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. యూఎస్‌పీసీ నాయకులు సంజీవ్, కిరణ్, గోపి, విష్ణువర్ధన్, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

బెల్లంపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ నాయకులు కోరారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ తన్నీరు రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ, దోమల బెడద, మురికి నీటి కాలువలు, గుంతల సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి.పూర్ణిమ, జిల్లా కార్యవర్గసభ్యుడు సీ.హెచ్.నర్సయ్య, పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి పాల్గొన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని సీఐటీయూ బెల్లంపల్లి మండల కన్వీనర్ సీ.హెచ్.దేవదాస్ అన్నారు. కమిషనర్ రమేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

**సమీక్ష సమావేశం**

భీమారం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మధుసూదన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంపీవో సతీష్ రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఘనంగా బోనాలు**

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత కేకే–1 సీఎస్పీ వద్ద గల దుర్గా భవానీ అమ్మ వారి బోనాల మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

**విద్యుత్ షాక్‌తో ఆవు మృతి**

చెన్నూర్‌రూరల్: మండలంలోని సొన్నారం గ్రామానికి చెందిన సాదారి రాజలింగు అనే రైతుకు చెందిన ఆవు బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది.